# ముంపు నివారణ చర్యలు చేపట్టాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు
- జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్‌లో వరదనీళ్లలో 70కి పైగా ఇండ్లు
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



దీన్‌దయాల్‌నగర్‌లో ముంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీశ్‌గౌడ్



మియాపూర్ : వర్షంతో రోడ్డుపై నిలిచిన వరద నీటిని పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి



జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్‌లో ఇండ్ల ముందు చేరిన వరద నీరు



కేపీహెచ్‌బీ : రోడ్లపై నీటి నిల్వలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బాలానగర్/మియాపూర్/అల్లాపూర్/కుత్బుల్లాపూర్/కేపీహెచ్‌బీ కాలనీ/దుండిగల్/జగద్గిరిగుట్ట, ఆగస్టు 20: ముంపు నివారణ చర్యలు తక్షణమే చర్యలు చేపట్టాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. మంగళవారం ఫతేనగర్ డివిజన్ పరిధి దీన్‌దయాల్‌నగర్ ప్రాంతం ముంపునకు గురైందని తెలుసుకున్న ఆయన డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సందర్శించి ముంపునకు గురైన ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. తక్షణమే మురుగును శుభ్రం చేయించి మునుపటి మాదిరిగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్‌దయాల్‌నగర్‌లో ముంపు నివారణ కోసం గతంలోనే రోడ్డు ఎత్తును పెంచి ముంపు నివారణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీన్‌దయాల్‌నగర్ సమీపంలో ఉన్న నాలాకు రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా పనులు టెండర్ దశలో ఉన్నాయని, టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడితే దీన్‌దయాల్‌నగర్‌కు శాశ్వతంగా ముంపు సమస్య దూరం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ పవన్, కాసుల మహేందర్ స్థానికులు పాల్గొన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధి అక్షయ్ ఎన్‌క్లేవ్‌లో వర్షపు నీరు వచ్చి చేరడంతో రహదారులు జలమయమయ్యాయి.

■ బాలానగర్ డివిజన్ పరిధి కళ్యాణినగర్ సమీపంలో జీడిమెట్ల–ఫతేనగర్ నాలా ఉండడంతో నిండిపోయి వర్షపునీరు వచ్చి చేరడంతో ముంపునకు గురైంది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మంగళవారం కళ్యాణీనగర్‌ను సందర్శించి ముంపును పరిశీలించారు. అనంతరం ఆయన శానిటరీ సిబ్బంది ద్వారా రహదారులు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

■ ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మల్లికార్జునకాలనీ రోడ్డు నంబర్3, అదేవిధంగా డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో తదితర ప్రాంతాల్లో చెరువును తలపించాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. మంగళవారం ఉదయం వర్షపునీరు తగ్గడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ శానిటరీ సిబ్బంది ద్వారా రహదారులను శుభ్రం చేయించారు.

■ మియాపూర్: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మాన్‌సూన్ సహా అనుబంధ విభాగాలన్ని అప్రమత్తంగా ఉండాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా యుద్ధ ప్రాతిపదికన వరద నివారణ చర్యలను చేపట్టాలన్నారు. భారీ వర్షం నేపథ్యంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నెక్టార్ గార్డెన్స్ గచ్చిబౌలి రోడ్ 1, బయోడైవర్సిటీ కూడలి, ఇందిరా నగర్, ఆలింద్ కాలనీ, లింగంపల్లి ప్రాంతాలలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి జడ్‌సీ ఉపేందర్ రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రహదారులపై నిలిచిన వరద నీటి నివారణ చర్యలను పరిశీలించి పలు సూచనలు చేసారు. అనంతరం జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరద నీరు కాలనీలను ముంచెత్తకుండా నాలాల్లో అడ్డుపడే వ్యర్థాలను వెంటనే తొలగించాలని, డ్రైనేజీలో నీరు వెళ్లిపోయేలా ఎటువంటి ఆటంకాలున్నా శుభ్రం చేయాలని సూచించారు. జోన్‌లో మూడు ప్రాంతాలలో వరద నీటిని మళ్లించేందుకు హోల్డింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు, వాటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రహదారులు, నాలాల పక్కన ఎటువంటి వ్యర్థాలు పేరుకోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, లేని పక్షంలో ముంపుకు దారి తీసే ప్రమాదం ఉందని జోనల్ కమీషనర్ పేర్కొన్నారు. మాన్ సూన్ బృందాలు క్షేత్ర స్థాయిలో ఉండి వరద నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులకు తక్షణ మరమ్మతులు పూర్తి చేయాలని జడ్సీ స్పష్టం చేశారు. ఆయన వెంట ఎస్ఈ శంకర్, డీసీ రజనీకాంత్‌రెడ్డి, రమేశ్ అధికారులున్నారు.

■ అల్లాపూర్: భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో వీధులన్ని జలమయమయ్యాయి. కార్పొరేటర్ సఫ్థార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో అధికారులతో కలిసి పర్యటించి, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### అధికారుల తప్పిదంతోనే వరద ముప్పు

కుత్బుల్లాపూర్: అధికారుల తప్పిదనం ఆ కాలనీ ప్రజలకు ముప్పు తెచ్చిపెట్టింది. చిన్నపాటి వర్షం పడినా కాలనీలో పెద్ద వరద.. కాలు బయట పెట్టాలంటే కనీసం ఐదు గంటలకు పైగానే ఇండ్లలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి.. నాలాకు దిగువన ఉండటంతో పూడిక తీత లేకపోవడం మూలంగా వరదనీరు వెనక్కి రావడంతో కాలనీలో వరదతో నిండితుందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. అయితే, కాలనీలో ఎగువన ఉన్న ప్రాంతంలో ఎత్తుగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఇక వరద ఎక్కడి వెళ్లకుండా పోతుంది. కాలనీలో ఉండే మ్యాన్ హోల్స్‌ను ఓపెన్ చేస్తే గానీ ఆ కాలనీలో వరద ఉధృతి తగ్గదు. ఇది జీడిమెట్ల 132 డివిజన్ వెంకన్నహిల్స్ కాలనీలో దుస్థితి. కాలనీలో సుమారు 70కిపైగా ఇండ్లు ఉంటాయి. పూర్తిగా నాలాకు సమీపంలో ఉండటంతో ఇటీవల కాలనీ ముందు శివారెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన కల్వర్టు వెడల్పుగా మారి దానికి ముందు భాగంలో వెంకన్నహిల్స్ కల్వర్టు చిన్నగా ఉండటం.. అదేవిధంగా కల్వర్టు నిర్మాణ కొనసాగుతుండటం, దత్తాత్రేయనగర్‌లో సీసీ రోడ్లు ఎత్తుగా నిర్మించడంతో వరద నీరు బయటకు వెళ్లకుండా మారింది. అధికారులు, సిబ్బంది వచ్చి మ్యాన్‌హోల్స్ మూతలు తెరిస్తే గానీ ఇక్కడ ఐదు గంటలకు పైగా వరద ఉధృతి తగ్గే పరిస్థితి లేదని, దీంతో కాలనీలోని కొంతమంది ఇండ్లలో వరదనీరు చేరి వస్తువులు, ఇతర సామగ్రి పూర్తిగా తడిచి అనేక ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో వరద ఉధృతికి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

■ కేపీహెచ్‌బీ కాలనీ: కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయాన్నే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగాల కోసం వెళ్లేవారంతా అగచాట్లు పడ్డారు. రోడ్లపైకి భారీగా వరదనీరు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ తెరుచుకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆయా లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని జీహెచ్ఎంసీ అత్యవసర బృందాలు రంగంలోకి దిగి తొలగించాయి.

■ దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణరావు పరిశీలించారు. అధిక వర్షపాతంతో గండి మైసమ్మ చౌరస్తా–మియాపూర్ రోడ్, బహదూర్‌పల్లి చౌరస్తాలోని వైన్స్‌షాపు ఎదురుగా నిలిచిన వర్షపు నీటిని మున్సిపల్ కమిషనర్ తొలగింపజేశారు. అదే విధంగా రోడ్డుపై మేటవేసిన ఇసుకను తీసివేయించి భవిశ్యత్‌లోనూ రోడ్లపై వరదనీరు నిల్వకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. గండిమైసమ్మ చౌరస్తా నుంచి మియాపూర్ వెళ్లే దారిలో రోడ్డుపై భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వర్షం పడినా ఇక్కడ నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

■ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే హెచ్‌ఎంటీ పైప్‌లైన్ రోడ్డులోని కల్వర్టును ఆయన పరిశీలించారు. కొద్దిపాటి వర్షానికే కల్వర్టు మీదుగా భారీ వరద పోవడాన్ని గమనించిన ఎంపీ, కల్వర్టు స్థానంలో బ్రిడ్జిని ర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వెంటనే స్పందించిన జోనల్ కమిషనర్ రూ.1కోటీ 20లక్షలతో ఎస్టీమేషన్ రూపొందించారు. ప్రతిపాదనలను ఎంపీ ఈటల జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పంపించి, సానుకూల చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్, శ్యాంకిరణ్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట సమీపం హెచ్ఎంటీ ప్రాంతం పైపులైన్ రోడ్డులో వరద సమస్య తొలగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. రాంకీ డంపింగ్ యార్డు సమీపంలో కల్వర్టు పొంగి రోడ్డుపై నీరు చేరుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకురాగా మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎంపీ జోనల్ మున్సిపల్ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. శాశ్వత ప్రాతిపదికన కల్వర్టు నిర్మించాలని తెలిపారు. కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ నేతలు భరతసింహారెడ్డి, శ్యాంకిరణ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో ముంపు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి



అల్లాపూర్: సహాయక చర్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం



దుండిగల్ : కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు



రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించిన అనంతరం ఇసుకమేటలను తొలిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



కళ్యాణినగర్‌లో రహదారులను శుభ్రం చేస్తున్న శానిటరీ సిబ్బంది


## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు


అల్లాపూర్, ఆగస్టు 20 : ఇటీవల శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన బొల్లు శ్రీనివాస్‌రావు తన నూతన కార్యావర్గ సభ్యులతో కలిసి వివేకానందనగర్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ సబీహాబేగం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇప్పటికే వివేకానందనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచామని, యూసుఫ్‌నగర్ శ్మశానవాటిక త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో లింగాల అయిలయ్య, వీరారెడ్డి, తుంగం శ్రీనానివాస్, రోణింకి జగన్నాథం, గుత్తికొండ రామకృష్ణ, కాయితి యాదవరెడ్డి, దేవరింటి మస్తాన్‌రెడ్డి, పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్, బండారు ప్రసన్నాంజనేయులు, పున్నం సూరిబాబు, నవ్వులూరి రోశయ్య, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు సంక్షేమ బోర్డు చేయాలి



మోటార్ రంగంలో పనిచేసే డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటోవర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ గౌడ్ అన్నారు. మాదాపూర్‌లోని ఖానామెట్‌లో మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ గౌడ్ విచ్చేసి ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలుతోపాటు ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులతో కలిసి హాజరై మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె. రామస్వామి, ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చందు, తుపాకుల రాములు, కృష్ణ, నర్సిరెడ్డి, నరేందర్, స్వామి, ఈశ్వరయ్య ఉన్నారు. *– మాదాపూర్, ఆగస్టు 20*

## బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ



బాలానగర్ డివిజన్ ఫిరోజ్‌గూడకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శంకర్‌గౌడ్ అనారోగ్యంతో సురారం లోని మల్లారెడ్డి నారాయణ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మంగళవారం శంకర్‌గౌడ్ కుటుంబసభ్యులకు కలిసి ఆర్థిక సాయం అందించి ఆర్థిక భరోసా కల్పించారు. కార్యక్రమంలో నర్రా దేవేందర్‌రెడ్డి, రంగంపేట శ్రీనివాస్, ప్రేం కుమార్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. *– బాలానగర్, ఆగస్టు 20*

## పేదలకు అండగా సీఎం సహాయనిధి



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



చింతల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు చెక్కులను అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

### ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్/కుత్బుల్లాపూర్, ఆగస్టు 20: సీఎం సహాయనిధి పథకం పేదలకు అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానలో ఉచితంగా వైద్యం పొంది అనారోగ్యాలను దూరం చేసుకుంటున్నారన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌కు చెందిన భూలక్ష్మికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్యే గాంధీ మంగళవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా సర్కారు కృషి చేస్తున్నదన్నారు.

■ రాఖీ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు మంగళవారం ఎమ్మెల్యే గాంధీ నివాసంలో ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

■ కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 235 మంది బాధితులు సీఎంఆర్ఎఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఆ కుటుంబాలకు రూ.95.30లక్షల విలువ గల చెక్కులు ప్రభుత్వం నుంచి రావడంతో మంగళవారం చింతల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ఆయా డివిజన్ల అధ్యక్షులతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్, ఫాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, ఏర్వ శంకరయ్య, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే మహిళలపై దాడులు



షాపూర్‌నగర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ నాయకులు, కార్యకర్తలు


దుండిగల్, ఆగస్టు 20: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేయడాన్ని ప్రగతిశీల మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, మహిళలపై జరుగుతున్న అనాగరిక దాడులను అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోవడంలేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ, పీఓడబ్ల్యూ హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ప్రధాన కార్యదర్శి భారతి అన్నారు. సూరారం డివిజన్ పరిధి,షాపూర్‌నగర్‌లో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళా జూనియర్ డాక్టర్, నర్సుపై జరిగిన దాడులకు నిరసనగా మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నా వాటిని అమలు చేసే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేకపోవడం కారణంగా మహిళలపై ప్రతినిత్యం దాడులు, వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో పద్మ, లక్ష్మి, వజ్రమని, అనసూర్య, భారతమ్మ, శోభ, సుగుణ, నాగమణి పాల్గొన్నారు.

## పాపిరెడ్డి కాలనీలో కార్డన్ సెర్చ్

### సరైన పత్రాలు లేని 16 బైక్‌లు, ఆటో సీజ్

కొండాపూర్, ఆగస్టు 20 : చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో మంగళవారం మియాపూర్ ఏసీపీ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ముం దస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ సెర్చ్‌ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, సెర్చ్‌లో భాగంగా కాలనీలోని సరైన ధృవపత్రాలు చూపని 16 ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోను సీజ్ చేసినట్లు చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు. కాగా, సెర్చ్‌లో చందానగర్‌తోపాటు ఆర్‌సీపురం, కొల్లూరుల ఇన్‌స్పెక్టర్లు, మియాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, ఆరుగురు ఎస్‌ఐలు, 46 మంది ర్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ/దుండిగల్/మియాపూర్, ఆగస్టు 20: దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికారని.. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత రాజీవ్‌గాంధీదని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. మంగళవారం దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ నెక్సెస్ మాల్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, సత్యం శ్రీరంగం, తూము వేణు, రేష్మ, ప్రవీన్‌కుమార్, రజిత, సంజీవరావు, పుష్పరెడ్డి, సునీల్, అరవింద్ రెడ్డి, మేకల మైకల్, ఫణీందర్, ప్రకాశ్, గంధం రాజు, శివ చౌదరి తదితరులున్నారు.

■ దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలంగౌడ్ పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.

## వీధి వ్యాపారుల డబ్బాలు తొలగించవద్దు ..

మియాపూర్, ఆగస్టు 20:మియాపూర్ డివిజన్ ఎంఏనగర్‌లో డబ్బాలు వేసుకుని చిల్లర వ్యాపారం చేస్తున్న వారికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఊరటనిచ్చిందని వీధి వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు పల్లె మురళి పేర్కొన్నారు. మంగళవారం ఎంఏనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. మియాపూర్ సర్వే నం.100 సమీపంలోని ఎంఏ నగర్ పరిసర ప్రాంతాల్లో పేదలు గడిచిన 20 ఏండ్లుగా డబ్బాలు వేసుకుని తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని, వాటిని తొలగించేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ప్రత్యామ్నాయం చూపించకుండా డబ్బాలు తొలగించవద్దని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వీధి వ్యాపారులను అక్రమంగా తొలగించాలని చూస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటచారి, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎంకాం(ఐఎస్), ఎంఎస్ డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ అన్ని కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈనెల 22లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుంతో 27లోగా చెల్లించవచ్చని చెప్పారు. పరీక్షా తేదీల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

**బీపీఎస్‌ఎల్పీ పరీక్షా ఫీజు స్వీకరణ**

ఓయూ పరిధిలోని బీపీఎస్‌ఎల్‌పీ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును 27లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుంతో 30వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షా తేదీల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

**ఎంబీఏ పరీక్షా ఫలితాలు విడుదల**

ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఎంబీఏ(సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.

**బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీల మార్పు**

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. అన్నివిభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ(ఏఐసీటీఈ), బీఈ (నాన్ సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈనెల 28నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

## బస్సులో మహిళ మెడలోని మంగళ సూత్రం చోరీ

మూసాపేట, ఆగస్టు 20: బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ మెడ నుంచి మంగళసూత్రం, గొలుసు గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కూకట్‌పల్లి పోలీసులు, బాధితురాలు తెలిపిన ప్రకారం.. బౌరంపేటకు చెందిన శ్వేత(23) పని నిమిత్తం అమీర్‌పేటకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో కూకట్‌పల్లి వైజంక్షన్ వద్దకు రాగానే ఆమె మెడ నుంచి గుర్తుతెలియని వ్యక్తి మంగళసూత్రం(3 తులాలు), గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలు వెంటనే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## భూవివాదంలో పలువురిపై కేసు నమోదు

కుత్బుల్లాపూర్,ఆగస్టు20: భూవివాదంలో పలువురిపై కేసు నమోదు చేసిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. సీఐ విజయవర్ధన్ తెలిపిన ప్రకారం...జీడిమెట్ల గ్రామంలో సర్వే నం.350లో ఎకరా 25 గుంటల ప్రైవేట్ స్థలంలో ఉన్న ఫెన్సింగ్, షెడ్డు నిర్మాణాలను కూల్చివేసి ఆక్రమణకు గురి చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా గొరిగ బీరప్ప, బాలమల్లేశ్, లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డిలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మాదాపూర్, ఆగస్టు 20: అక్రమంగా డ్రై గంజాయిని రవాణా చేస్తున్న ఓ నిందితున్ని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మంగళవారం శేరిలింగంపల్లి ఎక్సైజ్‌శాఖ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎక్సైజ్ టీడీఎఫ్ శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి, శంషాబాద్ ప్రొహిబిషన్ అధికారుల పర్యవేక్షణలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శంషాబాద్ ఆదేశాల మేరకు డీటీఎఫ్ శంషాబాద్ బృందం, శేరిలింగంపల్లి బృందంతో కలిసి గచ్చిబౌలి నుంచి శేరిలింగంపల్లి పాత ముంబై హైవే వరకు రూట్‌వాచ్ నిర్వహించగా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన గుణధర్ (39) స్కూటీ సీటు కింద భాగంలో, ఇంజన్‌పుట్ రెస్ట్, ఇతర ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లను దాచిపెట్టి హైదరాబాద్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. పోలీసుల తనిఖీల్లో గచ్చిబౌలి మార్గంలో ప్రయాణిస్తున్న గుణధర్ అనుమానంగా కనిపించడంతో స్కూటీని తనిఖీ చేయగా.. అతడి స్కూటీ సీటు, ఇంజిన్ వద్ద గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతంలో స్వయంగా గంజాయిని పండిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పంచనామా కింద అతని వద్ద 8 కిలోల గంజాయి పొడి ప్యాకెట్లు, ఒక మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం (సుజుకి యాక్సెస్ 125)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## బాధ్యతల స్వీకరణ

మియాపూర్, ఆగస్టు 20:శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు విభాగాల అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జోనల్ సీపీగా శ్యాంకుమార్, ఏసీపీగా సాయిబాబా, చందానగర్ సర్కిల్ ఏసీపీగా నాగిరెడ్డి, టీపీఎస్‌గా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శేరిలింగంపల్లి వైద్యాధికారిగా శ్రీకాంత్‌రెడ్డి, చందానగర్ సర్కిల్ వైద్యాధికారిగా డాక్టర్ రవి, యూసుఫ్‌గూడ, పటాన్ చెరు వైద్యాధికారులుగా డాక్టర్ శామ్యూల్, విజయ్‌మోహన్ విధుల్లో చేరారు. చందానగర్ సర్కిల్‌కు డీసీగా ఇప్పటి వరకు ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. శేరిలింగంపల్లి డీసీ రజనీకాంత్‌రెడ్డి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

## ఆటో పైనుంచి పడిన చువ్వలు.. తప్పిన ప్రమాదం

ట్రాలీ ఆటోకు బ్రేకులు వేయడంతో దానిపైన ఉన్న ఇనుప చువ్వలు ఒక్కసారిగా జారిరోడ్డుపై పడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో ఆటో ముందు వెనుక ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పినట్లైంది. ఈ ఘటన మంగళవారం బహదూర్‌పల్లి పరిధి,శ్రీరాంనగర్,హెచ్‌పీ పెట్రోల్ బంక్ మూలములుపు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోట్రాలీ అద్దాలు ధ్వంసం కావడంతో డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. కొద్దిసేపు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారని స్థానికులు తెలిపారు. *– దుండిగల్, ఆగస్టు 20*

